# బ్లాంక్ చెక్

శిరీషను చూసేందుకు శివతోపాటు అతడి తల్లి, బంధువులు, మిత్రులు కూడా వచ్చారు.

పెళ్లిచూపులు ముగిశాయి.

అబ్బాయి, అమ్మాయి ఒకరికొకరు నచ్చినట్టు అందరికీ అర్థమైపోయింది.

"అమ్మాయిని ఏమైనా అడుగు బాబూ" అన్నారు ధనుంజయరావుగారు.

"పెళ్లంటే నూరేళ్లపంట. ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోవడం ఎంతైనా అవసరం" అతని మాటకు వంతపాడాడు అవధాని.

"అడిగేందుకేమున్నాయి. అమ్మాయి గురించి అన్నీ మీరే చెప్పేసారు. శిరీష నాకు నచ్చింది. సరేనా?" అన్నాడు శివ.

కొడుకు పెళ్లికి ఊ అనడంతో ఊపిరి పీల్చుకుంది ఉమామహేశ్వరి. ఎలాగైనా తనయుడికి తొందరగా పెళ్లయితే చాలని చూస్తోందావిడ.

"కట్నకానుకలు కూడా ఇప్పుడే సెటిల్ చేసేసుకుంటే బావుంటుందేమో! దగ్గర్లోనే భేషుక్కైన ముహూర్తాలున్నాయి."

అవధాని మాటలకు చిరునవ్వు నవ్వుతూ "కట్నం ఇంత ఇస్తానని నా నోటితో నేను అనను. ఇదుగో బ్లాంక్ చెక్. నీకెంత కావాలో రాసుకో సంతకం చేసిస్తాను" అన్నారు ధనుంజయరావుగారు.

శివ చెక్కు మీద ఎంత రాస్తాడా అని అంతా చేష్టలుడిగి చూస్తున్నారు.



పెన్నుతెరచి అటు ఇటు చూశాడు శివ.

"ఫరవాలేదు రాయి బాబూ" అంకె రాసి కాబోయే మావగారి చేతికిచ్చాడు శివ.

"వన్‌రుపీ ఓన్లీ!"

శివను వెర్రి వెంగళప్పను చూసినట్లు చూశారు తోడుగా వచ్చిన మిత్రబృందం.

అబ్బాయి ఔన్నత్యాన్ని చూసి ముగ్ధులయ్యారు. బంధుజనం.

కాబోయే అల్లుడికి ధనాశ లేదని తెలుసుకుని ఎంత గానో ఆనందించారు ధనుంజయరావుగారు. తను పెట్టిన పరీక్షలో నెగ్గినందుకు అతడికెంతో సంతోషంగా వుంది. ఇహ పిల్లనివ్వడానికేమాత్రం ఆలోచించనక్కర్లేదని అనుకు న్నారు.

"శుభం" అన్నా రంతా లేచి.

పెళ్లివారిని గుమ్మం వరకు సాగనంపారు ధనుం జయరావు గారు.

"ఓరి దౌర్భాగ్యుడా! పది లక్షలో పదిహేను లక్షలో రాస్తావనుకున్నాం. అదేవిట్రా అలా చేశావ్?" బయటకొస్తూనే చీవాట్లేసారు మిత్ర బృందం.

"శిరీష ధనుంజయరావుగారి ఏకైక పుత్రిక వెనకా ముందూ అతనికి వారసులెవరూ లేరు. అడిగినా అడగకపోయినా అతని ఆస్తి అంతా నాదే కదరా! అంతలోనే తొందర పడటం దేనికని" అన్నాడు శివ.

అతడి ముందుచూపుకి ఆశ్చర్యపోయి నోళ్ళు మూసు కున్నారు అతని మిత్రబృందం. అయితే ఇంతకుముందే వారిద్దరికీ పరిచయం వుందని, ధనుంజయరావు గారు పెట్టే పరీక్ష శిరీష ద్వారా శివకి ముందుగానే తెలిసిపోయిందన్న నిజం అక్కడున్న వారికెవరికీ తెలీదు.

**(10-3-2005 ఆంధ్రభూమి వీక్లీ)**